# శిక్ష

'కృష్ణ'




ఎన్నో సినిమాలలో చూసింది సుగుణా పరబ్రహ్మం. ఎన్నో తెలుగునే కాక తర్జుమా చేసిన సినిమా కథలలో కూడా చూసిందీ—చదివిందీ. అట్లా సినిమా చూస్తున్నప్పుడు, కథ చదువుతున్నప్పుడు అనుకునేది, అట్లాగే తనూ పాత్రలో లీనమైపోవాలి. భర్త ఆఫీసునుంచి ఇంటికి వచ్చే టైమ్‌కి చిరునవ్వుతో ఎదురు వెళ్ళాలి. ఒయ్యారంగా అతని వెనుకకి వెళ్ళి కోటు విప్పాలి. అలవోకగా టీ కప్పు తీసుకు వచ్చి శ్రీవారి చేతి కివ్వాలి. నిజానికి సుగుణకు బాగా జ్ఞాపకం ఉన్న సినిమాలో 'పతివ్రత' బిరుదు పొందిన తన అభిమాన హీరోయిన్ 'ఓహోహో శ్రీవారూ. ఆహాహా తేనీరూ'' అని పాట పాడుతూ సరిగ్గా పాట అయిపోయే సరికల్లా హీరోకి టీ కప్పు అందిస్తుంది. 'ఇప్పుడా ఇంటికి, ఇంత లేటు! విప్పెద ఉండుడు మీకోటు' అని పాడుతూ కోటు విప్పుతుంది. అంతకు ముందేమో తలుపు తీస్తూ 'వచ్చిన దెవరదా—శ్రీవారా? తెచ్చితిరా లేదా నాకో చీరా?' అంటూ చిరునవ్వులతో తలుపుతీస్తూ ఆహ్వానిస్తుంది. కానీ జీవితం సినిమా కాదన్న సంగతి గుర్తించింది కనకనే పాటని వది లేసింది.

సుగుణ మోజు కోసమనే గాని పరబ్రహ్మం ఏనాడూ కోటు తొడిగి ఎరగడు. అంతేకాదు, పెళ్ళయి కాపరానికి వెళ్ళిందాకా అతనికి. టీ, కాఫీల అలవాటు కూడా ఉండేదికాదు. సుగుణ అభిమాన హీరో ఉదాత్త గంభీర దుఃఖరస నటనలతోపాటూ పెరుగుతూ వచ్చిన మహాబిలాలవంటి నాసికా రంధ్రాల్లోంచి రైలింజను వదలినట్లు గుప్పు గుప్పున పొగ విడుస్తూ విశాల ప్రపంచంలోకి వెళ్ళిపోయే సినిమాలు చూసి ముచ్చటపడితే తప్పనిసరై స్నేహితుడు దేవేంద్ర వద్ద సిగరెట్ పొగ ముక్కున వదలడమూ, రింగులు తియ్యడమూ మొదలైన ఫీట్స్ కొన్ని నేర్చుకున్నాడు.

ఇవాళ సుగుణా పరబ్రహ్మం కమ్లా విష్ణు వాళ్ళింటినించి వచ్చిన దగ్గరినించీ గాఢమైన ఆలోచనలో పడిపోయింది. అందువల్లనే తలుపులు తెరచినప్పుడు గానీ, టీ కప్పు వారి చేతి కందించే టప్పుడుగానీ పాత్రలో లీనం కాలేక పోయింది.

పరబ్రహ్మం రెండు మూడు సార్లడిగినా చెప్పకపోయింది సుగుణ. ఆ చూస్తున్న చూపు తనవైపో, తన పైకో, తనలోకో అర్థంగాక మరోసారి అడిగేడు—''ఏమిటి? మళ్ళీ ఏదో ప్రాబ్లంమీద పడ్డట్టున్నావు?''

''అబ్బబ్బ. ఏముందీ! టీ తాగండి ముందు.'' భర్తని తోవ మళ్ళిస్తూ అంది సుగుణ. ''మగవాళ్ళు ఆఫీసు నుంచి ఇంటికొస్తే ముందు గంభీరంగా టీ తాగుతారు. మీరేమో పూహా రికే శోధిస్తుంటారు...''గొంతులో చిటికెడు విసుగు కూడా వేసింది వైపో, పైకో, లోకో చూస్తూనే.

తను సాధన చేసిన దృష్టితో ఆమెకు తెలీకుండానే ఆమె చూపుల్ని గమనిస్తూనే ఉన్నాడు పరబ్రహ్మం.

ఇంతలో బిలబిలాడుతూ పిల్లలు రానే వచ్చేశారు. వాళ్ళకి టిఫినూ, హార్లిక్సూ, వాళ్ళని పుస్తకాలమీద కూర్చోబెట్టడం, పనివెంట పని.

కాసేపు గడిచి మళ్ళీ ఎవరి పాత్రలో వారు లీనమైపోయాక అంది సుగుణ: ''ఏమండీ! ఒక చిన్న ప్రశ్న అడుగుతాను—చెప్పండి. పూ? మేధావు లందరికీ ఇది ఉంటుంది —నాలుగు

అక్షరాలు. ఏమిటో చెప్పండి?"

"ఆలోచన..." సాలోచనగా అన్నాడు పరబ్రహ్మం. "కరక్టేనా?"

"ఆగండి చెపుతాను. మరో ప్రశ్న. వంశ పారంపర్యంగాగానీ, మానసిక కారణాలవల్ల గానీ ఇది పెరగవచ్చు. మళ్ళీ నాలుగక్షరాలే — ఏమిటో చెప్పండి?"

"ఏముంటీ. . ." ఆలోచించడం ఇందాకనే మానేసిన పరబ్రహ్మం మళ్ళీ "ఆలోచనే" అన్నాడు. "కరక్టేనా?"

సుగుణ మాట్లాడలేదు. స్తబ్దంగా కూర్చుండిపోయింది.

పుస్తకం ముందేసు కూర్చున్న పక్కింటి అబ్బాయి "నే చెప్పనా, అంటీ? బట్టతల, బట్టతల, క్లాత్ హెడ్" అన్నాడు.

సుగుణ కంగారుగా 'అమంగళము ప్రతిహతముగుగాక' అనుకుంటూ "సర్లే, మీరు చదువుకోండి" అంటూ కసిరింది. "పెద్దవాళ్ళ విషయాలు మీ కెందుకూ!"

"కరక్టే. నాకుతట్టనేలేదు" నవ్వుతో పరబ్రహ్మం పెదాలు అర్ధచంద్రాకారంలోకి మారినాయి. "క్లాత్ హెడ్— క్లాత్ హెడ్! హహ్హహ్హా."

సుగుణ మనసు కీడు శంకించ సాగింది. సరిగ్గా ఇలా కీడు శంకించిన సన్నివేశాల్లో పతివ్రత ఏం చేస్తుంది? పరుగెత్తుకు వెళ్ళి ఇందుమించు భుజంగాసనంలో ఒక పక్కకి తిరిగి "తల్లీ—మాతా—అమ్మా — ఇన్నాళ్ళ నుంచీ నిన్నే కొలుస్తున్నానే. పూజిస్తున్నానే. ఆరాధిస్తున్నానే. నా భర్తకు రాబోయే ఈ ఉపద్రవాన్ని నివారించడాని కేదయినా మార్గం చూపవా, జననీ" అంటూ మొరబెడుతుంది, విన్నవిస్తుంది, మనవిచేస్తుంది.

కానీ తనలా చెయ్యడాని కిదేం సినిమా కాదుగదా. పైగా రోజూ తను చేస్తున్న పూజకి నెల నెలా లెక్క చూసుకుంటూనే ఉన్నది. పోతే క్లాత్ హెడ్ లాంటి విషయాలు స్త్రీ దేవత కాబట్టి ఆవిడ అధికార పరిధిలోకి వస్తాయో రావో... అందువల్ల తన ప్రయత్నం తాను చేసుకోవడమే మంచిదేమో!

గత నెల రోజులుగా భర్త తలకి నూనె రాస్తున్నప్పుడు చేతులకూ, దువ్వెనకూ అంటుకు వచ్చే వెంట్రుక పోచల్ని చూస్తూనే ఉంది గాని, ఎప్పుడూ ఇంత గాభరా పడలేదు తను. నిన్నటి రోజున కమ్లా విష్ణు ఇంట్లో ప్రమాద సూచక సంకేతాలని తన కళ్ళతో తను చూసిందాకా. అప్పట్పింది ఆయన్ని చూసినప్పుడల్లా త్వరలో తనకు క్లాత్ హెడ్ వస్తుందన్న కఠోర సత్యం తెలిసి సత్యవంతుడిలా కన్పిస్తున్నారు. తానేమో దాన్ని నివారించబూనుకున్న 'సావిత్రి' పరబ్రహ్మం.

"కృషితో నాస్తి దుర్భిక్షమ్. అనగా క్షామంబి పనిచేసిన ఎడల" అంటూ బడా బడా చదువుతున్నాడు పక్కింటి పంటి.

ఆ కుర్రాడి నోట తనకోసం ఆ ఇష్టదేవతే ఈ మాట అన్పించి ఉంటుంది అనుకుంది సుగుణ. ఇప్పుడు శ్రీమతి విష్ణుమూర్తే శరణ్యం. తెలివిగలది. ఎప్పుడూ పుస్తకాలు చదువుతూనే ఉంటుంది. వాళ్ళాయన, ఇంకొందరు మిత్రులు కూడా ఎదురొన్న సమస్య లెన్నింటినో సులువుగా పరిష్కరించేసిందట కూడా. అటువంటి దానికి ఈ బోడి క్లాత్ హెడ్ ఒక పెద్ద సమస్యా! ఏదో చిట్కా చెప్పక పోదు.

మర్నాడే భర్త పిల్లలు వెళ్ళగానే ఇంటికి తాళంవేసి కమ్లా విష్ణు వాళ్ళ ఇల్లు 'వైకుంఠ'కి వెళ్ళింది. (ఇక్కడే రెండ్రోజుల క్రితం ఫోటోల ఆల్బమ్ చూసింది. అందులో విష్ణుమూర్తి బొమ్మ పెళ్ళినాటిదీ, ఆ తరువాత కొన్నీ, ఆ తరువాత కొన్ని సంవత్సరాల లోని బొమ్మలూ చూసినప్పుడు సుగుణకి 'కప్పయొక్క జీవిత చక్రము' అనే చార్టు చూడగానే కప్ప వివిధ జీవిత దశలూ ఎంత సులభంగా తెలిసి పోతాయో క్లాత్ హెడ్ యొక్క వివిధ దశలూ అంత విపులంగా తెలిసిపోయినాయి.)

తన రీడింగ్‌ని బట్టి భర్త మొదటి దశలో ఉన్నారు. అదే సంగతి చెప్పి ఇటీవలది భర్త ఫోటో ఒకటి ఇచ్చింది కమలకు.

కమ్లా విష్ణు శ్రద్ధగా విన్నది. ఫోటో జాగ్రత్తగా చూసింది. లెక్క వేసుకుని చూసింది. ఆవిడ అనుసరించిన కేశమానాన్నిబట్టి పరబ్రహ్మం ద్వితీయ రాశిలో ఉన్నట్లు తేలింది.

ఎకడమిక్ డిస్కషన్ అయిన తరువాత చికిత్స ప్రస్తావన రాగానే కమ్లా విష్ణు పెదవి విరిచింది. "దేన్నయినా సరేనేమో గాని, దీన్నిమాత్రం నివారించడంకష్టమనుకుంటాను సుగుణ గారూ. అట్లాంటి అవకాశం ఏమాత్రం ఉన్నా ఇవాళ్టి రోజున మానా శ్రీ స్థితిలో ఉండేవారు కాదు." నిట్టూర్చింది, విష్ణుమూర్తి తలను మనో ఫలకంపై టెలివిజన్ మీద చూసి నట్లు చూస్తూ...

సుగుణకి కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది. ప్రపంచమంతా శూన్యంగా కన్పించసాగింది. అతి కష్టంమీద తనను తాను నిలదొక్కుకోగలిగింది. మనస్సులో ఇకముందు భర్త తలపై జరగనున్న కార్యక్రమం సినిమా వేసి నట్లు వివరంగా కన్పించసాగింది.

"ఏమైనా ఈ క్లిష్ట సమయంలో మీకునా హృదయపూర్వక సానుభూతి తెలియబరుస్తున్నాను, సుగుణగారూ" అంది కమ్లా విష్ణు. "అయితే కారు మబ్బుకి జరీ అంచులాగ ఒక్క విషయం మీరు తెలుసుకుంటే కొంత ఓదార్పు దొరుకుతుందేమో. ఏమిటంటే గొప్ప గొప్ప వాళ్ళలో చాలమంది క్లాత్ హెడ్సే సుమండీ" అంటూ నెహ్రూ, పటేల్ మొదలైన రాజకీయవేత్తల్నీ, షేక్స్పియర్, థామస్ హార్డీ వంటి రచయితల్నీ, సీజర్, నెపోలియన్ లాంటి విజేతల్నీ, గెలీలియో, న్యూటన్ మొదలైన సైంటిస్టులనీ పేర్కొంటూ సుగుణ గమనించకుండా లాఘవంగా టాగూర్నూ, కాళిదాసునూ, ఐన్‌స్టీన్నూ కూడా లైన్లోకి నెట్టేసింది.

వైకుంఠపురం నుంచి కైలాస పర్యటనకి వెళ్ళింది సుగుణ పతివ్రతను గుర్తుచేసుకుని ఉద్దీపన పొందుతూ, రెండంతస్తుల మెట్లు ఎక్కి.

శ్రీమతి మంగళా పరమేశ్వర్ తలంటుకున్నట్లుంది. జుట్టు ఆరబెట్టుకుంటోంది. "ఓహో మీరా? సంతోషం— రండి రండి" అంటూ ఆహ్వానించింది.

"నే నొక విషమ సమస్య నెదుర్కొంటున్నాను మంగళాదేవీ. మీ సలహా సంప్రదింపులకోసం వచ్చేను. శ్రీమతి విష్ణుమూర్తి దగ్గరికెళ్ళాడా వెళ్ళాను. మీ అన్నయ్యగారు మంచి పేరున్న ఆయుర్వేద వైద్యులని అప్పుడెప్పుడో చెప్పేరు కదా" — 'అవు'నని మంగళ తలూపిన తర్వాత విషయాన్ని వివరించింది సుగుణ.

విని చిరునవ్వు నవ్వింది శ్రీమతి మంగళ. "అదినిజమేననుకోండి. ఆమాట కొస్తే మా అన్నయ్య ఆయుర్వేదం కోర్సు పూర్తయ్యాక ఈ విషయం పైనే రెండు సంవత్సరాలు దీక్షతో రీసెర్చి కూడా చేశాడు. ఆనే రెండు రోజుల్లో ఇక్కడి కొస్తున్నానని రాశాడు చిత్రంగా. మీ అదృష్టమో, మా వారి అదృష్టమో మరి!" అని —"ఉండండి ఇప్పుడే వస్తాను" అని లోపలికి వెళ్ళింది.

ఎడారిలో మంగళ ప్రదంగా ఎదురు తూర్పు చ్చనిపించింది సుగుణకి.


ఇంతలో వచ్చింది మంగళ. చేతిలో ఫోటో ఉంది. "మీరు మా వారి జుట్టెప్పుడూ చూడలే దనుకుంటా" అంటూ ఫోటో చూపించింది.

బుజ్జొడు నొక్కు నొక్కుల, దువ్వెన ఎరుగని దుర్గ మారణ్యం వంటి అశేష కేశరాశి! ! !

ముగ్ధురాలై పోయింది సుగుణ— "అబ్బ ఎంత చిక్కని జుట్టో!"

ఆ రెండు రోజులూ రెండు యుగాలుగా గడిపేసింది సుగుణ. మూడో రోజున మధ్యాహ్నానికల్లా మంగళ నించి కబురు రానే వచ్చింది.

సుగుణ వెళ్ళేసరికి ఆ సాయంత్రం పనిపనిషి రానట్లుంది. పాత్రల్తోలీనమై ఉంది మంగళ. "రండి, రండి" చేతులు కడుక్కుని ఇవతలికి వచ్చింది.



లోనికి వెళ్ళి కూర్చున్న తరవాత సుగుణ ముందు మ్యాగజైన్స్ పడేసి పాత్రధారణ పూర్తి చేసి వస్తానని వెళ్ళింది మంగళ.

సినిమాపత్రికలు చూస్తూ కూర్చుంది సుగుణ. ఇండ్లలో భార్యాపిల్లలతో ఫోటో దిగిన హీరోల బొమ్మలు చూస్తే ఇంచుమించు అంతా క్లాత్ హెడ్స్‌లాగే కన్పించేరు తనకి. మరో పత్రికలో ఒక ప్రకటన — 'ప్రకృతితో పోరాడండి. బట్టతలపై జుట్టు రాబట్టుకోండి.' ఆసక్తితో చూచింది తను. సారాంశం ఏమిటంటే, క్లాత్ హెడ్ శరీరంలో నుంచి పుష్కలంగా ఉన్న జుత్తుని తలమీద వరివాటు వేసినట్లు చక్కగా నాటు వేస్తారు. వివరాలకు సంప్రదించండి అంటూ చిరునామా ఇచ్చేరు.

పని పూర్తి చేసుకుని వచ్చింది మంగళ.

కాసేపటికి ఆమె అన్నకూడా వచ్చేడు.

పరిచయం చేసింది మంగళ. "మా అన్నయ్య పరాంకుశ ధన్వంతరి. వీరు




శ్రీమతి సుగుణ. వీరి భర్త పరబ్రహ్మం గారు. కెమికల్ ఇంజనీరు."

నమస్కారం పెడుతూ నిర్ఘాంత పోయింది సుగుణ. ఆయన పూర్తిగా క్లాత్ హెడ్డే!

"నమస్కారం,నమస్కారం" అంటూ సుగుణ ఆశ్చర్యాన్ని గమనించి "హాఁ హాఁ హాఁ"—అని నవ్వేడు పరాంకుశ ధన్వంతరి తలనిమురుకుంటూ. "తెలుసుకున్నాను. మీ ఆందోళనకు కారణ భూతమయిన సమస్యను గురించివిన్నాను.

అట్లాగే నోరు తెరిచి వింటూ పోయింది సుగుణ.

"ఈ సమస్య ఉన్నది చూశారా— అనాదిగా మానవుణ్ని వేధిస్తున్న సుప్రసిద్ధమైన సమస్యల్లో ఇదిన్నీ ఒకటి. ప్రాచీన శిలాయుగంలోనున్నా ఈ సమస్యతో మానవుడు సతమతమైనాడనటానికి మెక్సికోలోని గుహల రాతి గోడలపైన గీయబడిన చిత్రాలు ప్రబలమైన ఆధారాలు." డైరెక్టుగా పాయింటుకే వచ్చేశాడు డాక్టర్ పరాంకుశం గారు. "క్రీస్తు పూర్వం పంచమ సహస్రాబ్దిలో చాలా అనే మిశ్ర దేశ సార్వభౌముని ఈ సమస్య పీడించగా రాజమాత ఒక చికిత్సను సూచించింది.

ఆసక్తిగా ముందుకు జరిగింది సుగుణ.

"అయితే ఆ చికిత్స సత్ఫలితాన్నిస్తుందా లేదా అన్న విషయంమాత్రం ఎవరిపైనైనా ప్రయోగం చేస్తేనే తెలియవలె. కావడానికి సులభమైన చికిత్సే. మన ... కుక్క ... అదే— మామూలు కుక్కఉన్నది చూశారూ..."

"కుక్కా!? ఎందుకూ" విస్తుపోతూ చూసింది సుగుణ.

"అహ్హాహహ!" నవ్వేడు డాక్టర్ పరాంకుశం. "మరేమీ లేదు— దాని పంజాతోనే మనకు పని. ఆ పంజాయున్నూ, తరవాత మన ... గాడిద ఉన్నది చూడండి..."

"గాడిదా!?"

"అహ్హాహహ. అవును గాడిదే. కేవలం గాడిద. దాని కాలికి గల గిట్టలున్నూ, మామూలుగా మన ... ఖర్జూరం ఉన్నదే ఆ ఖర్జూరమూ—ఈ వస్తుత్రయాన్ని బాగా దంచి, నూనెలో వండి, ఆ నూనెను తలపై మర్దించడం..."

సుగుణకు నోరు మూత పడలేదు, మాటా రాలేదు.

మంగళ టీ సంగతి చూస్తోంది లోపల.

"ఆశ్చర్యం ఏమీ లేదు. చూడండి రోమక దేశంలో పూర్వం రాలిపోయిన కేశ సంపదను పునః పొందగలందులకై ఎలుగుబంటి కొవ్వును వాడేవారని మనకురూఢిగా తెలుస్తూ ఉంటున్నది."

"! ? ! ?"

"ఇక పోతే క్రీస్తు పూర్వం మొదటి శతాబ్దికి వత్తాము. ఆ కాలంలో గ్రీకు దేశానికి చెందిన భిషగ్వరుడు డియోస్కొరిడిస్సు మరొక విషయం తెలుపుతూ ఉన్నాడు. మన పాములు ... పాములున్నాయి చూశారా — వాటిని సజీవంగా ఉడకబెట్టి తయారు చేసిన అవుషధాన్ని మూడు రోజుల కొకసారి ఉపయోగిస్తే 'వస్త్ర' శిరస్సు లగిపోవచ్చు." తలనిమురుకుంటూ చూపులు వాళ్ళ చెప్పుకు పోతున్నారు పరాంకుశం గారు.

"! ? ! ?"

"అమ్మా! ఇకపోతే కాయకల్ప చికిత్సా విధానానికి వత్తాము. పచ్చి ఎలకుల నుంచి తీసిన నూనె, ఏదీ మన పచ్చి ఎలకులు?" తలెత్తి చూసిన పరాంకుశం గారికి సుగుణ కన్పించలేదు.

లోపల్నించి 'వోక్—వోక్—వోక్" ధ్వనులూ, ఆందోళనగా "ఏమైంది సుగుణగారూ!" అంటూన్న మంగళగళ కళపెళలూ విన్పిస్తున్నాయి.

● ● ●

అంతా విని విరగబడి నవ్వింది కమ్లా విష్ణు. "బావుందండీ సుగుణగారూ— ఈ వైద్యం సంగతి వింటూంటే నా కో సామెత గుర్తు కొస్తూంది. కొండ నాలిక్కి మందు వేస్తే ఉన్న నాలిక వూడిందట. అట్లా ఉంది. అయినా మీకంతగా నచ్చనిదైతే పోనీ ఓ పదిహేను వేలు ఖర్చు పెట్టుకోండి. సుబ్బరంగా హెయిర్ ట్రాన్స్ ప్లాంట్ చేస్తారు. కొంటెగా చూసింది సుగుణ వైపు. "మొన్నీ మధ్య మన దేశానికి వచ్చిన క్రికెటీర్ బాయ్‌కాట్ కూడా ఆ మధ్య జుత్తు నాటు వేయించుకున్నాడట. మా వారు తనూ చేయించుకుంటానని ఒకటే గొడవ పెట్టారనుకోండి."

"ఎంత ఖర్చవుతుం దన్నారూ?" అంది సుగుణ సాలోచనగా.

"నే నొప్పుకోలేదుసమ్మండీ. పదిహేను వేలంటే మాటలా! అదీ ఏం బ్రహ్మాండమైన ప్రయోజనం కోసమనీ! పైగా అదొక యాతనతో కూడుకున్న చికిత్స. సరే యాతనఅలా తగలడనీండి. ఆయనే పడ్తా రనుకుందాం. నిష్కారణంగా వృథా ఖర్చేగదా వద్దన్నాను. ఉహూఁ కాదు ఏమయినా సరే చేయించుకోవాల్సిందే నే సంపాదించే డబ్బేగా అంటూ రాయను ఇట్లా ఒక రెండు మూడు నెల్లను కోండి. రోజూ వాదనే! నయానాభయానా చెప్పి చూశాను. ఉహూఁ... వినరే."

"వోయ్!" అంది సుగుణ ఆశ్చర్యం నిండిన ఆసక్తితో. "ఎప్పుడూ చెప్పనే లేదే మీరూ!"

"ఇక నాకు విసుగేసిం దనుకోండి ఈ తగాదాతో. ఒకటే చెప్పాను తనకి. మీరుగనీ పదిహేను వేలు పోసి ఆ జుత్తు నాటేగనీ వేయించుకోండి. ఆ మరుక్షణంలో నేను పెర్సిస్ ఖంబాటాలాగా జుత్తు తీయించేసుకోకపోతే చూడండి అన్నాను కోపంలో. హిప్పటికి దారికొచ్చే రనుకోండి"

"ఏమిటేమిటీ?" కుతూహలంగా అడిగింది సుగుణ. "ఎవరా పెర్సిసూ?"

"మీకు తెలీదా? ఉండండి— చూపిస్తాను" అని లోపల్నించి సినిమా బొమ్మల పుస్తకం ఒకటి తెచ్చి చూపించింది కమ్లావిష్ణు — నున్నగా గుండు గీయించుకున్న ఓ యువతి బొమ్మ!

"హవ్వ!!" అని నోరు తెరుచుకుని అలాగే చూస్తూండి పోయింది సుగుణ మళ్ళీను.

"నిన్న 'ప్రమదావనం'లో జవాబులు చదువుతూంటే అనుకోకుండా ఈ గడ్డు సమస్యకి పరిష్కారం దొరికింది చివరికి. మదరాసు విగ్గుల ఫ్యాక్టరీలో చక్కటి విగ్గులు కావలసిన సైజూ, షేపుల్లో నాలుగైదు వందల రూపాయల్లో దొరుకుతాయట. ఈ సారి తిరుపతి వెళ్ళినప్పుడు అలాగే మద్రాసు వెళ్ళి తీసుకుంటాం."

"ఒయ్!" అంది సుగుణ సంతోషం నిండిన కుతూహలం, ఆశ్చర్యాలతో.

"అదీ నాకైతే ఇష్టం లేదు. ఆయన కావాలంటున్నారు—అంతే. నాన అట్టాగు నాకైతే అసలు మగాడి తలకి అదీ అందమేఅన్పిస్తుంది. ఎస్వీరంగారావునూ, జగ్గయ్యనూ చూశారా మీరు? అంతెందుకూ అసలు సినిమాలోకంలో బట్టతల అందంగా ఉంటారు నాగేశ్వరరావు. బాపూని చూడండి. ఆ పైపు, ఆ బట్టతలా — మేధావీ — కళాకారునిలా, ఎంత అందంగా ఉంటాడో. చూసే వాళ్ళ పేట్టని బట్టే అంటాను" అంది కమ్లా విష్ణు.

"మరలాంటప్పుడు విగ్గెందుకూ?" మళ్ళీ కన్‌ఫ్యూజన్‌లో పడిపోతూ అడిగింది సుగుణ అవగాహనకంగా.

"అది ఆయన పిచ్చికి మందు. అయితే విగ్గు కొన్న తరవాతైనా సరే ఇంట్లో పెట్టుకోనిస్తానా నేను. ఆయన చక్కగా విగ్గులేకుండా అలా ఉంటేనే హాయిగా, ఆనందంగా ఉంటుంది నాకు" అంటూంటే సంతోషంతో కళ్ళు మూసుకు పోయాయి కమ్లా విష్ణుకు.

తేలికపడ్డ దానిలా నవ్వింది సుగుణా పరబ్రహ్మం. తను ఇంత కష్టపడ్డందుకు బట్టతల సమస్య—ఉహూఁ— భర్త తల సమస్య ఈ విధంగా పరిష్కారం అయినందుకు ఇష్టదేవతకు వందనార్పించుకుంది మనసులో. *

( ఈ కథకు కావలసిన సాంకేతిక సమాచారం కొంత మార్గదర్శి, ఆరోగ్య సచిత్ర మాస పత్రికలో శ్రీ సమ్మట రచించిన వ్యాసం నుండి తీసుకున్నాను. వారికీ ఆ పత్రికకూ కృతజ్ఞతలు— రచయిత. )